క్లుప్తంగా

డీజీపీని కలిసిన కరాటే మాస్టర్



మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ కరాటే మాస్టర్, రాష్ట్ర స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నయ్య సోమవారం హైదరాబాద్‌లో డీజీపీ శివధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బాధితులకు పరామర్శ



అడ్డాకుల: మూసాపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన గౌతమ్, నగేశ్, రాజు జిల్లాకేంద్రంలోని వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం వారిని పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన గాజులపేట వాసి యాదగిరిని కూడా పరామర్శించారు. జానంపేటకు చెందిన కాశన్న పాము కాటుకు గురవడంతో ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ, నాయకులు అంజనేయులు, శివరాములు తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ఘననివాళి



జడ్చర్ల టౌన్: జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కొత్తకేశవులు వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి కొత్తకేశవులు స్మారక సేవాట్రస్టు సభ్యులు, కుటుంబ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. జడ్చర్ల తొలి ఎమ్మెల్యేగా ఆయన చేసిన సేవలను గుర్తుకు చేసుకున్నారు. ఆయన స్ఫూర్తిగా సేవాట్రస్టు కార్యక్రమాలు చేపడుతుందని ప్రకటించారు. కార్యక్రమంలో కొత్త జవహర్‌బాబు, రామకృష్ణ, రాధాకృష్ణ, నాయకులు జగన్, భీంరాజ్, రాములు పాల్గొన్నారు.

ఓబీసీ మండలాధ్యక్షుడిగా కుమార్‌యాదవ్

జడ్చర్ల టౌన్: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మండలాధ్యక్షుడిగా కుమార్‌యాదవ్‌ను నియమిస్తూ మండల అధ్యక్షుడు యాట రామకృష్ణ నియామకపు పత్రం అందజేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో నియామక పత్రాన్ని జిల్లా అధికార ప్రతినిధి బాలవర్ధన్‌గౌడ్‌తో కలసి అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీని అన్నివిధాలుగా బలోపేతం చేసేందుకు కృషిచేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల సత్తా చాటాలన్నారు. అన్ని స్థానాల్లోనూ పోటీచేయడంతోపాటు గెలుపునకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి నర్సింహులు, ఎస్టీ మోర్చ ఉపాధ్యక్షుడు మహేందర్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

దేవరకద్ర: మున్సిపాలిటీలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం ఆవరణంలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య నిపుణుల ఆధ్వర్యంలో అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట

జడ్చర్ల టౌన్: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే అలయ్ బలయ్ ద్వారా సంస్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేసినట్లవుతుందని రాష్ట్ర సంగీత నాటక అకాడమి మాజీ చైర్మన్ శివకుమార్ అన్నారు. సోమవారం రాత్రి చంద్రగార్డెన్‌లో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెండేళ్లుగా అలయ్ బలయ్ నిర్వహిస్తున్నామని, వచ్చే ఏడాది మరింత పెద్ద సంఖ్యలో పట్టణవాసులు హాజరవుతారని ఆశా భావం వ్యక్తం చేశారు. మత సామరస్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటివి ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేణుక, పట్టణ ప్రముఖులు లక్ష్మయ్య, నయీమోద్దీన్, జంగయ్య, మహేశ్వర్, పెంటయ్య, ప్రకాశ్, గోపాల్, రవీందర్ పాల్గొన్నారు.



నత్తనడకన!

- దివిటిపల్లి రైల్వే వంతెన వద్ద బ్రిడ్జి నిర్మాణం
- పండగల వేళ కిలోమీటర్ల మేర నిలుస్తున్న వాహనాలు



దివిటిపల్లి వద్ద జాతీయ రహదారిపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణం పనులు

భూత్పూర్: దివిటిపల్లి వద్ద ఎన్‌హెచ్–44 జాతీయ రహదారి కింద రైల్వే ట్రాక్ సమీపంలో బ్రిడ్జి నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. నెల రోజుల నుంచి ఒకే వైపు నుంచి వాహనాలు దారి మళ్లించడంతో ప్రతి నిత్యం సాయంత్రం వేళతో పాటు శని, ఆదివారాల్లో కిలోమీటర్ల మేర వందలాది వాహనాలు నిలిచిపోతున్నాయి. భూత్పూర్ నుంచి జడ్చర్ల వైపు వెళ్లేదారిలో ప్రతినిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఒకే దారిలో రెండు వైపుల వాహనాలు వెళ్లడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శని, ఆదివారాల్లో వీకేండ్ కావడంతో కర్నూల్, బెంగుళూరు, తిరుపతికి వందలాదిగా వాహనాలు వెళ్తుంటాయి. రెండు కిలోమీటర్ల మేర వాహనాలు బారులుదీరుతున్నాయి. సోమవారం దస రా సెలవులు ముగియడంతో హైదరాబాద్ వెళ్లే కార్ల తో పాటు భారీ వాహనాలు సైతం రెండు కిలోమీటర్ల వాహనాలు అరగంట పాటు నిలిచిపోయాయి. ప్రమాదవశాత్తు బ్రిడ్జిపై ప్రమాదం జరిగితే గంట పాటు వాహనాలు బారులు తీరాయి. ఎన్‌హెచ్ఐ అధికారులు పర్యవేక్షణ చేపట్టి బ్రిడ్జి నిర్మాణం త్వరితగతిన పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



శేరిపల్లి (బి) వద్ద జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

గెలిచే అభ్యర్థులను ఎంపిక చేయండి



బాకీల కార్డును విడుదల చేస్తున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

- పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

గండేడ్: స్థానిక ఎన్నికల్లో గెలిచే అభ్యర్థులను ఎంపిక చేయాలని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఉమ్మడి మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. స్థానిక సమరంలో బీఆర్ఎస్ అభ్యర్థులదే పైచేయి ఉండాలన్నారు. అలా జరగాలంటే గ్రామాల్లో సమర్థులైన అభ్యర్థులను ఎంపిక చేయాలన్నారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా అభ్యర్థులను ఎన్నికల్లో నిలబెట్టాలన్నారు. గెలిచిన అభ్యర్థులు ప్రజలకు సేవచేసేవాడై ఉండాలని సూచించారు. ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజల్లోకి వెళ్లే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చేప్పే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఇచ్చిన గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని బాకీల కార్డుతో ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అసమర్థతను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో కూడా మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు క్రియాశీల కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేసి సత్తా చాటాలన్నారు. అన్నిస్థానాల్లో గెలుపొందే విధంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. వచ్చిన అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకొని బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో గండేడ్, మహమ్మదాబాద్ మండలాల అధ్యక్షులు పెంట్యానాయక్, బిక్షపతి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ మాజీ అధ్యక్షుడు గోపాల్, మాజీ సర్పంచులు వెంకట్‌రాంరెడ్డి, రాజేశ్వర్, గీతా, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

నవాబుపేట: స్థానిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా వాటిని గెలుచుకునేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల అధ్యక్షుడు నర్సింహులు అధ్యక్షతన జడ్చర్ల సమీపంలో జరిగిన మండల మఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థలు ఎన్నికలు ఎప్పుడు జరిగిన వాటిని గెలుపొందాలని దానికిగాను అందరు సిద్ధం కావాలన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన గ్యారంటీ కార్డుల మాటేంటని ప్రశ్నించి బాకీ కార్డులు చూపించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలలో బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్, అనంతయ్య, ప్రతాప్, సంతోష్‌రెడ్డి, రాజు, యాదయ్య, నాగిరెడ్డి, రాంప్రసాద్, పురుషోత్తం, చందర్‌నాయక్, రఘు ఉన్నారు.

‘సీజేఐపై దాడికి పాల్పడిన వ్యక్తిని శిక్షించాలి’

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని టీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ కళాభవన్ ఆవరణలో సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టులో ఓ కేసును విచారిస్తున్న సీజేఐపై సనాతన ధర్మాన్ని కించపరుస్తున్నావంటూ ఓ వ్యక్తి దాడికి పాల్పడటం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చెన్నకేశవులు, నాయకులు ఆశన్న, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తున్నాం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సీజేఐ గవాయ్‌పై దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు ఓ ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగబద్ధమైన న్యాయవాద వృత్తిలో ఉన్న న్యాయవాది వ్యవస్థకు భంగం కలిగే విధంగా సీజేఐపై చెప్పుతో దాడికి యత్నించడం సిగ్గు చేటని పేర్కొన్నారు. దాడి చేసిన వ్యక్తిపై దేశద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పీఓలు, ఏపీఓలకు శిక్షణ



జడ్చర్ల టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో విధులు నిర్వహించే పీఓలు ఏపీఓలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. గతంలో హాజరుకాని వారికోసం ప్రత్యేకంగా శిక్షణ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పీఓలు, ఏపీఓలకు పలు సూచనలు చేశారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించరాదని, చిత్తశుద్ధితో ఎన్నికల బాధ్యతలు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా శిక్షణ కొనసాగింది. శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ మంజులాదేవి, ఎంపీఓ సరోజ, సూపరింటెండెంట్ వెంకట్‌ప్రసాద్ పాల్గొన్నారు.

చంద్రశేఖర్ కుటుంబానికి న్యాయం చేయాలి



కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: అమెరికాలో దుండగుల కాల్పుల్లో మృతిచెందిన చంద్రశేఖర్ కుటుంబానికి న్యాయం చేయాలని పలువురు ప్రజా, ముస్లిం సంఘాల ప్రతినిధులు కోరారు. జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్‌లో బైత్ అల్ ఖైర్ ఫౌండేషన్, సోహైల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టి చంద్రశేఖర్‌కు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ అమెరికాలో భారత విద్యార్థులపై ఇటీవల జరుగుతున్న ఘటనలు బాధాకరమని పేర్కొన్నారు. కాల్పులు జరిపిన దుండగులను వెంటనే అరెస్టు చేసి శిక్షించేలా భారత ప్రభుత్వం కృషిచేయాలని కోరారు. చంద్రశేఖర్ కుటుంబానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బైత్ అల్‌ఖైర్ అధ్యక్షుడు మహ్మద్ తఖీ, సోహైల్ ట్రస్ట్ అధ్యక్షుడు జహంగీర్, ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్, ఆయా పార్టీల నాయకులు సాయిబాబా, మొయిజ్, ఇబ్రాహీం, మహ్మద్ ఉమ్, హస్నొద్దీన్, అబ్దుల్లా, సోహైల్ పాల్గొన్నారు.

ఎంఈఓగా బాధ్యతల స్వీకరణ

మిడ్జిల్: మండల విద్యాధికారిగా మిడ్జిల్ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం సరస్వతి సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి, జీహెచ్ఎంలు సుధాకర్, వెంకటయ్య, మండలంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు వచ్చి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో అందరి సహకారంతో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

నదులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే



ట్యాంక్‌బండ్‌పై స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్న మౌంట్‌బాసిల్ విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నదులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పాఠశాల చైర్మన్ చంద్రకళ వెంకటయ్య పేర్కొన్నారు. ‘హమారీ నదియా హమారీ జిమ్మెదారి’ కార్యక్రమంలో భాగంగా మౌంట్‌బాసిల్ హైస్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులు జిల్లాకేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్‌పై స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, ట్యాంక్‌బండ్‌పై ఉన్న చెత్తాచెదారాన్ని ఏరివేసి, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా నదులను సంరక్షించే అవసరంపై అవగాహన కల్పించారు. నీటి సంరక్షణ, నదుల పరిశుభ్రత, పర్యావరణ రక్షణలో నదుల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు శిరీష ప్రవీణ్‌కుమార్, పుజితా మోహన్‌రెడ్డి, సుశాంత్ కృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛమైన నదులను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దాదాపు 100 దేశాల్లో ఈ నదుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. నదులను కాపాడితే మనల్ని కాపాడుకున్నట్టేనని వివరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో భాగస్వాములైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించింది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్‌రెడ్డి, ఎన్‌సీసీ సీటీఓ వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నరాజమూర్ ఆలయానికి రూ.7, 76, 200 ఆదాయం

దేవరకద్ర: చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం తలనీలాల వేలం నిర్వహించారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి 2026 నవంబర్ 30వరకు తలనీలాలను పోగు చేసుకోడానికి రూ.4.91 లక్షలకు వన్నాడ గోపాల్ వేలం పాడి దక్కించుకొన్నాడు. కొబ్బరి కాయల వేలం జాతర సమయంలో ఒకనెలకు మాత్రమే రూ.2.76 లక్షలకు గోవర్ధన్ అనే వ్యక్తి దక్కించుకున్నాడు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకోడానికి రూ.9200లకు కుర్మయ్య అనే వ్యక్తి వేలం పొందాడు. వేలాల ద్వారా ఆలయానికి మొత్తం రూ.7, 76, 200 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఈవో శ్యాంసుందర్, చైర్మన్ గోపాలాచార్యులు, రాఘవేంద్రాచార్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతికి సంతాపం

దేవరకద్ర: గూరకొండకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గౌనిరాంరెడ్డి మృతి చెందడంతో సోమవారం పలువురు కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ హన్మంతరెడ్డి, దేవరకద్ర, కొత్తకోట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పలువురు గూరకొండకు వెళ్లి రాంరెడ్డికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఐదు దశాబ్దాలుగా అలుపెరగని పోరాటం చేశాడని నాయకులు కొనియాడారు.

జాతీయస్థాయిలో ప్రతిభ చాటాలి



వెంకటేశ్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జాతీయస్థాయి యోగా పోటీల్లో ప్రతిభచాటి పతకం సాధించాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ.వెంకటేశ్, హనుమాన్ యూత్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సురేశ్‌చందర్ అన్నారు. మైసూర్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమంలో ఈనెల 9నుంచి 12వరకు జరిగే 50వ (గోల్డెన్ జూబ్లీ) సీనియర్ జాతీయ స్థాయి యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న సీనియర్ యోగా క్రీడాకారుడు కోటకదిర వెంకటేశ్‌ను సోమవారం హనుమాన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సుభాష్ కాంప్లెక్స్‌లో పూలమాల, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా క్రీడాకారుడు జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. జాతీయస్థాయి యోగా చాంపియన్‌షిప్‌లో పతకం సాధించి జిల్లాకు పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రవణ్‌కుమార్, రమేశ్‌చందర్, పీఎస్ఆర్ ప్రసాద్, జగదీశ్, బాలు, కరుణసాగర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించాలి

చిన్నచింతకుంట: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం వాల్మీకి జయంతిని వాల్మీకులు ఘనంగా నిర్వహించుకోవాలని బీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజయ్య పిలుపునిచ్చారు. వాల్మీకి సంఘం నాయకుల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో గ్రామప్రజలతో కలిసి వేడుకలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

గిరిజన ఆశ్రమ హాస్టళ్ల వర్కర్లను క్రమబద్ధీకరించాలి



మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న రోజువారీ కూలీలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలోని తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేసే డైలీ వైజ్ వర్కర్స్‌ను క్రమబద్ధీకరించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేసే డైలీ వైజ్ వర్కర్లు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్కర్లు తమ డిమాండ్ల సాధనకు సెప్టెంబర్ 12వ తేదీనుంచి సమ్మె చేస్తున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఎన్నిల ముందు అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలు, హాస్టళ్లలో పనిచేసే డైలీవైజ్ వర్కర్స్ సమస్యలను తమ పార్టీ దృష్టికి తీసుకుపోయి ప్రభుత్వం స్పందించేలా చొరవ తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన ఆశ్రమ పాఠశాలు, హాస్టళ్ల డైలీవైజ్ వర్కర్స్ సంఘం సభ్యురాలు చిట్టెమ్మ మాట్లాడుతూ.. 212జీఓను సవరించి 2014 నాటికి ఐదు సంవత్సరాలు సర్వీస్ ఉన్న వారందరినీ క్రమబద్ధీకరించాలని కోరారు. నల్లగొండ జిల్లాలో కొంత మందికి ఇస్తున్న విధంగా టైం స్కేల్ ఇవ్వాలని కోరారు. ఔట్ సోర్సింగ్ విధానం అమలు చేయకూడదన్నారు. కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. పెండింగ్ వేతనాలను ఇచ్చేందుకు ట్రెజరీకి ఆదేశాలు ఇవ్వాలన్నారు. సమ్మె కాలపు వేతనాలు ఇవ్వాలని కోరారు. మరణించిన కార్మికులకు కుటుంబ సభ్యులను డైలీ వైజ్ వర్కర్లుగా నియమించాలన్నారు. పండుగ సెలవులను కలుపుకొని పన్నెండు నెలల వేతనాలు ఇవ్వాలని కోరారు. పది లక్షల ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్లు 5లక్షలు ఇవ్వాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సురేశ్, జ్యోతి, ఎల్లప్ప, అనసూయ, అరుణ, అంజిలమ్మ, పద్మమ్మ, మూలాలజీ, అనిత, రజిత పాల్గొన్నారు.

‘సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం’

జడ్చర్ల టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 9పై సుప్రీంను ఆశ్రయించగా కోర్టు కొట్టివేయడాన్ని స్వాగతిస్తున్నామని బీసీజాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ అభిప్రాయపడ్డారు. సోమవారం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 9ను వ్యతిరేకిస్తూ మాధవరెడ్డి హైకోర్టులో పిటీషన్ వేయగా, ఈనెల 4న గోపాల్‌రెడ్డి సుప్రీం కోర్టులో పిటీషన్ వేశారని, దానిని కోర్టు కొట్టివేయడం అభినందనీయమన్నారు. హై కోర్టులోనూ బీసీలకు అనుగుణంగా తీర్పు వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం సిద్ధించిన నాటినుంచి నేటివరకు బీసీలకు అన్నిరంగాల్లోనూ తీరని అన్యాయం జరిగిందని, ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపునకు ముందుకొచ్చిన సమయంలో కేసుల పేరుతో కాలయాపన చేయడం భావ్యం కాదన్నారు. సమావేశంలో రజక సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఫకీర్ జహంగీర్ పాషా, నాయకులు నర్సింహులు, శేఖర్, గోపాల్, చెన్నయ్య, భీంరాజు, శివశంకర్, నాగేశ్, మహేశ్ పాల్గొన్నారు.

నాయకమ్మ చెరువు లీకేజీకి మరమ్మతులు



నాయకమ్మ చెరువు లీకేజీ పనులను పరిశీలిస్తున్న అధికారులు

మహమ్మదాబాద్: మండలంలోని నంచర్లకు చెందిన నాయకమ్మ చెరువుకట్ట మధ్యభాగంలో గండి పడింది. దీంతో రైతులు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సోమవారం ఉదయం రెవెన్యూ అధికారి హైమద్ ఆధ్వర్యంలో ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య రైతులతో కలిసి కట్టకు ట్రాక్టర్‌లతో మట్టిని పోయించి నీటి లీకేజీని అరికట్టారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. ఇటీవల భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు తమ చెరువుల రక్షణపై కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కట్ట అలుగు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నప్పుడు అధికారులకు సమాచారం అందిస్తూ కలిసికట్టుగా నిరోధించాలని సూచించారు. మండల వ్యాప్తంగా అతి పెద్ద చెరువులైన మల్కచెరువు, ఏటిచెరువు, గాధిర్యాల్ ఊరచెరువుపై దృష్టిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో నంచర్ల రైతులు తదితరులు పాల్గొన్నారు.


నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధ్యమని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డా.శశిభూషణ్ అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని ఏనుగొండలో ఫౌండేషన్ విత్తనాలతో సాగుచేస్తున్న పలువురు రైతుల పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విత్తనంతో పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. అనంతరం రైతులకు విత్తనోత్పత్తిలో మెలకువలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ సునీత తదితరులు పాల్గొన్నారు.

వైద్యవిద్యార్థినికి ఆర్థిక సాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నీట్‌లో మంచి మార్కులు సాధించి ఎంబీబీఎస్ సీటు సాధించిన మహబూబ్‌నగర్ మండలం మాచన్‌పల్లి తండాకు చెందిన గిరిజన బిడ్డ కడావత్ రాజేశ్వరి గిరిజన సేవా సంఘం నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం ఆమె నివాసానికి వెళ్లి గిరిజన సేవా సంఘం తరపున రూ.10వేలను అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ.. నిరుపేద అయిన రాజేశ్వరికి ఎంబీబీఎస్‌లో సీటు సంపాదించి మొదటి సంవత్సరంలో ఫీజు కట్టలేని పరిస్థితి తెలుసుకుని తమ వంతుగా ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర నాయకులు హన్మానాయక్, ఉపాధ్యక్షులు తిరుపతినాయక్ పాల్గొన్నారు.

‘కెమిస్ట్ డ్రగ్గిస్ట్’ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీకాంత్



జడ్చర్ల టౌన్: కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వర్కింగ్ జిల్లా ప్రెసిడెంట్‌గా ముచ్చర్ల శ్రీకాంత్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ సోమవారం నియామకపు పత్రం విడుదల చేశారు. గతనెలలో నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో ప్ర.దాన కార్యదర్శిగా పోటీచేసి కేవలం 3ఓట్ల తేడాతో అపజయం పాలైన శ్రీకాంత్ సేవలు సంఘానికి అవసరమని భావించి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పేర్కొన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన శ్రీకాంత్‌ను జడ్చర్ల కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అభినందనలు తెలియజేశారు. జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అభివృద్ధికి అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఇతర కార్యవర్గంతో కలసి కృషిచేస్తానని శ్రీకాంత్ తెలియజేశారు.

పీయూ అధ్యాపకురాలికి డాక్టరేట్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ ఫార్మసీ కళాశాలలో అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న స్వాతికి అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈమేరకు ఆమె గైడ్ అధ్యాపకురాలు మేనక ఆధ్వర్యంలో మానవాళి సంక్షేమం, ఆరోగ్యం, ప్రకృతి, సంరక్షణ కాంక్షిస్తూ ‘ఇన్ సిలికో బయోయాక్టివిటీ ప్రిడిక్షన్ డెవలప్‌మెంట్ అండ్ ఎవాల్యుషన్ ఆఫ్ డ్రగ్ ఫార్ములేషన్ ఫర్ ఎన్హాన్స్ థెరపిటిక్ అవుట్‌కమ్స్’ అంశంపై చేసిన పరిశోధనలకు గానూ ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టరేట్ అందుకున్న స్వాతికి వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్ అభినందనలు తెలిపారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ

జడ్చర్ల: మండలంలోని గంగాపూర్, జడ్చర్ల, పోలేపల్లి, ఆలూరు, ఈర్లపల్లి రైతు వేదికల వద్ద రైతులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన వేరుశనగ విత్తనాలను సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్ పంపిణీ చేశారు. జాతీయ నూనె గింజల పథకం కింద యాసంగి పంటసాగుకుగాను వేరుశనగను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ గోపీనాథ్, ఏఈఓలు నర్సింహులు, శారద, శేఖర్, భవానీ, రైతులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో జైలు శిక్ష

జడ్చర్ల: మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జరిమానతోపాటు జైలు శిక్ష విధించినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. మహబూబ్‌నగర్ మండలం ఎదిరకు చెందిన విష్ణుకుమార్ గతనెల 24న మద్యం సేవించి వాహనం నడుపుతుండగా జడ్చర్ల పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా.. విచారించిన న్యాయమూర్తి నిర్మల రూ.2వేలు జరిమానాతోపాటు రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



మిడ్జిల్: ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా కారును ఢీకొట్టడంతో, కారు మరో ఆటోను ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివ నాగేశ్వర్‌నాయుడు కథనం ప్రకారం.. ఊర్కొండ మండలంలోని రేవల్లికి చెందిన ప్రవీణ్‌కుమార్ తన పనిమీద వెల్జాల్‌కు వెళ్లి మిడ్జిల్‌కు కారులో వస్తుండగా.. మిడ్జిల్ స్టేజీ సమీపంలో వాడ్యాల్‌కు చెందిన ఆంజనేయులుగౌడ్ నిర్లక్ష్యంగా అతివేగంగా ఆటోతో కారును ఢీకొట్టాడు. దీంతో కారు రోడ్డు పక్కనే ఉన్న మరో ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న కల్వకుర్తికి చెందిన దాసరి ఆంజనేయులుకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ఆంజనేయులుగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.